
సాక్షి

భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం । 26 । ఆగస్టు । 2024



తాలిపేరుకు తగ్గిన వరద

తాలిపేరు ప్రాజెక్టుకు వరద ఉధృతి తగ్గుతోంది. దిగువకు 15,141 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

8లో



నేడు కృష్ణాష్టమి..

శ్రీకృష్ణాష్టమి వేడుకలకు ఆలయాలను ముస్తాబు చేశారు. సోమవారం పండుగ ఘనంగా జరుపుకోనున్నారు.

8లో



వాతావరణం

జిల్లాలో సోమవారం ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

జ్వరాల వ్యాప్తి.. జాగ్రత్తలు

ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో నేడు ఫోన్ ఇన్



డాక్టర్ రామకృష్ణ

భద్రాచలంఅర్బన్: భద్రాచలంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు డెంగీ, చికున్ గున్యా, వైరల్ జ్వరాల బారిన పడుతున్నారు. ఈ జ్వరాల నివారణకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు 'సాక్షి' ముందుకొచ్చింది. ఈనెల 26న సోమవారం రోజున 'ఫోన్ ఇన్' కార్యక్రమం చేపడుతోంది. జ్వరాల నివారణకు ఏయే జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై భద్రాచలం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ ప్రజల సందేహాలకు సమాధానాలు ఇస్తారు.

సాక్షి ఫోన్ ఇన్

తేదీ : 26-08-2024, సోమవారం
సమయం :
మధ్యాహ్నం 12 నుంచి 1 వరకు
ఫోన్ చేయాల్సిన నంబర్ :
99590 86989

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి విశేష పూజలు



అమ్మవారి ఆలయం వద్ద భక్తుల సందడి

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి ఆదివారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయాన్ని భక్తులు అధిక సంఖ్యలో సందర్శించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరాగా, ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. క్యూలైన్ ద్వారా భక్తులు అమ్మవారిని దర్శించుకోగా, అర్చకులు పూజలు జరిపారు. భక్తులు అన్నప్రాసనలు, ఒడి బియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమంలో అర్చకులు, రజనీకుమారి భక్తులు పాల్గొన్నారు.

విరాళం అందజేత

పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి అమ్మవారి భక్తులైన ఇల్లెందు సుభాష్‌నగర్‌కు చెందిన వేముల రాజ్యలక్ష్మి, రాజనర్సు దంపతులు రూ.5,116 విరాళాన్ని అందజేసినట్లు ఈఓ రజనీకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేటి ప్రజావాణి రద్దు

సూపర్‌బజార్(కొత్తగూడెం): కృష్ణాష్టమి పండుగ సందర్భంగా ప్రభుత్వం సెలవురోజు కావడంతో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు అందుబాటులో ఉండరని, ప్రజలు ఈవిషయాన్ని గమనించి కలెక్టరేట్‌కు రావొద్దని సూచించారు.

గిరిజన దర్బార్ కూడా..

భద్రాచలంటౌన్: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా నేడు (సోమవారం) ప్రభుత్వ సెలవు కావడంతో భద్రాచలం ఐటీడీఏలో నిర్వహించే గిరిజన దర్బార్‌ను రద్దు చేసినట్లు పీఓ బి. రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలవు రోజు అధికారులు అందుబాటులో ఉండరని, గిరిజనులు ఈ విషయాన్ని గమనించి ఐటీడీఏకు రావొద్దని పీఓ కోరారు.

నాజర్‌పాషాకు జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఎస్‌డీ నాజర్‌పాషా

మణుగూరు టౌన్: ఏరియా సింగరేణి సేవా సమితి సభ్యుడు, సామాజిక సేవకుడు ఎస్‌డీ నాజర్‌పాషా బహుజన సాహిత్య అకాడమీ(బీఎస్‌ఏ) సేవా రత్న అవార్డు అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌ నాచారంలోని బీఎస్‌ఏ కార్యాలయంలో సంస్థ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా అవార్డు పొందారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రతి ఏటా సంఘసేవకులు, రచయితలు, కవులకు అవార్డులు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌతమ్, విష్ణు, పసుల రమేశ్, జమీలా బేగం, హేర్షద్ బాబు, వాహేద్, నల్లా కోవెల తదితరులు ఉన్నారు.

పల్లెపోరుకు కసరత్తు..

ఓటరు జాబితా తయారీకి షెడ్యూల్ విడుదల

- వార్డుల వారీగా రూపొందించనున్న అధికారులు
- జిల్లా వ్యాప్తంగా 479 గ్రామపంచాయతీలు



ఓటరు జాబితా రూపకల్పనపై శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్లు

చుంచుపల్లి: రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై కీలక ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామాల వారీగా ఓటరు జాబితా రూపకల్పనతోపాటు వార్డుల విభజనకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేసింది. దీంతో గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు సంబంధిత అధికారులు ముందస్తు కసరత్తు ప్రారంభించారు. పార్లమెంట్ ఎన్నికలకు వినియోగించిన ఓటర్ల జాబితా ఆధారంగా గ్రామాల్లో ప్రత్యేకంగా జాబితా సిద్ధం చేసే పనిలో ఉన్నారు. ఇప్పటికే మాస్టర్ ట్రైనర్లు గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓలకు వార్డుల విభజనకు సంబంధించిన శిక్షణ ఇచ్చారు. గ్రామాల్లో ఇకపై పంచాయతీ సిబ్బంది వార్డుల వారీగా ఓటరు జాబితాలను రూపొందించనున్నారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఒక గ్రామంలో రెండు, మూడు పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. ఇప్పుడు పంచాయతీ వార్డులవారీగా పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు అనుగుణంగా ఆయా కుటుంబాలు ఏయే వార్డుల్లో నివసిస్తున్నాయి. వారందరూ ఏ పోలింగ్ బూత్ పరిధిలోకి వస్తున్నారనే విషయాలను పరిశీలించనున్నారు. కుటుంబ సభ్యుల ఓట్లన్నీ ఒకే బూత్ పరిధిలోకి వచ్చేలా కసరత్తు చేస్తున్నారు.

21న తుది ఓటరు జాబితా

స్థానిక పోరుకు రంగం సిద్ధమవుతోంది. గ్రామపంచాయతీల్లో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం సూచించడంతో అధికారులు ఆ దిశగా కసరత్తు చేపట్టారు. కులగణన తర్వాతే పంచాయతీ పోరు ఉంటుందని ముందుగా ప్రకటించిన ప్రభుత్వం.. తాజాగా ఊహించని రీతిలో పల్లెపోరుకు సంబంధించిన ఓటరు జాబితా తయారీకి షెడ్యూల్ ప్రకటించింది. ఓటరు జాబితా ప్రక్రియ పూర్తయిన తర్వాత అక్టోబర్‌లో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు. ఇక గ్రామ పంచాయతీల్లో ఎన్నికలకు సంబంధించి ఈ నెల 29న ఓటరు జాబితా తయారీపై కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల సంఘం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనుంది. సెప్టెంబరు 6న గ్రామ పంచాయతీ వార్డుల వారీగా ముసాయిదా ఓటరు జాబితాను పంచాయతీ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచుతారు. జాబితాపై 7 నుంచి 13 వరకు అభ్యంతరాలు స్వీకరించి, 9న జిల్లాస్థాయిలో, 10న మండల స్థాయిలో అధికారులు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి సందేహాలు, అభ్యంతరాలపై చర్చిస్తారు. 19న జిల్లా పంచాయతీ అధికారులు అభ్యంతరాలపై తుది నిర్ణయం తీసుకుంటారు. 21న వార్డుల వారీగా తుది ఓటరు జాబితా విడుదల చేస్తారు. జిల్లాలో 481 గ్రామ పంచాయతీలు ఉండగా, సారపాక, భద్రాచలం మినహా మిగతా 479 గ్రామ పంచాయతీలకు 2019లో ఎన్నికలు జరిగాయి. వీటికి గతంలో మాదిరిగానే ఈ పంచాయతీలకు మూడు దశల్లో ఎన్నికలను నిర్వహించే అవకాశం ఉంది. అయితే పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు నిర్వహిస్తారా లేక మారుస్తారా అనే అంశంపై ప్రభుత్వం నుంచి స్పష్టతరావాల్సి ఉంది.

ఎన్నికలకు సిద్ధంగా ఉంటాం..



గ్రామాల వారీగా ఓటరు జాబితాల రూపకల్పనపై కసరత్తు చేస్తున్నాం. ఎంపీఓలు, కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించారు. ఓటరు జాబితాల తయారీ, వార్డుల విభజనపై సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చాం. గ్రామాల్లో సెప్టెంబరు 21న తుది ఓటరు జాబితాలను ప్రదర్శిస్తాం. గ్రామ పంచాయతీలకు ఎప్పుడు ఎన్నికలు నిర్వహించినా అన్ని విధాలా సిద్ధంగా ఉంటాం.

–వి.చంద్రమౌళి, డీపీఓ

అందని కంటి వైద్యం

- జిల్లా సర్వజన ఆస్పత్రిలో సౌకర్యాల లేమి
- శస్త్రచికిత్సకు థియేటర్లు, పరికరాలు లేని వైనం
- ఆవేదన చెందుతున్న కంటి సమస్యల బాధితులు



జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రి

కొత్తగూడెంరూరల్: జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రిలో కంటి వైద్యం అందని పరిస్థితి నెలకొంది. రోజూ ఆస్పత్రికి కంటి సమస్యలతో సుమారు 50 మంది పేషంట్‌లు వస్తున్నారు. గత జనవరి నుంచి ఇప్పటివరకు కంటి సమస్యలతో 6 వేల మంది ప్రజలు ఆస్పత్రికి వచ్చారు. వీరికి కంట్లో మందులు వేయటం తప్పితే, తెల్ల శుక్లాలు తొలగించటంలేదు. ఇక్కడ కంటి వైద్యులు ఉన్నా శస్త్ర చికిత్స చేసేందుకు పరికరాలు ఆపరేషన్ థియేటర్లు లేవు. దీంతో కళ్ల సమస్యలతో వచ్చినవారికి ఓపీ చూసి, మందులు రాసి పంపిస్తున్నారు. వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న సర్వజన ఆస్పత్రిలో కళ్లకు శస్త్ర చికిత్స చేసే అవకాశం లేకపోవడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో వైద్య కళాశాల ప్రారంభమై రెండేళ్లు గడుస్తున్నా సర్వజన ఆస్పత్రిలో సమస్యలు పరిష్కారం కావడంలేదు. ఇక్కడ మూడు ఆపరేషన్ థియేటర్లు ఉండగా, రెండు జనరల్ సర్జరీలు, ఒకటి ఆర్థో సర్జరీలకు వినియోగిస్తున్నారు. ప్రత్యేకంగా కంటి ఆపరేషన్లకు థియేటర్ లేదు. ఇటీవల తనిఖీకి వచ్చిన కలెక్టర్‌కు ఆస్పత్రి అధికారులు ఈ విషయమై నివేదించారు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ.వేలల్లో ఫీజులు

ప్రైవేట్ ఆస్పత్రుల్లో కంటి పరీక్షలు, తెల్లశుక్లాలు తొలగింపునకు రూ. వేలల్లో వసూళ్లు చేస్తున్నారు. కంట్లో తెల్లశుక్లాన్ని తొలగించి, లెన్స్ అమర్చితే రూ. 5 వేల నుంచి రూ. 35 వేల వరకు బిల్లులు తీసుకుంటున్నారు. ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో కంటి వైద్యులు అందిన కాడికి దోచుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కాగా పాల్వంచలోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో రేషన్ కార్డు ఉంటే ఉచితంగా కంటి శస్త్ర చిక్సిత చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కంటి వైద్యం అందేలా చూడాలని బాధితులు కోరుతున్నారు.

'కంటివెలుగు' ఊసేది?

40 సంవత్సరాల వయసు దాటిన వారికి కంటి సమస్యలు వస్తాయి. కంట్లో తెల్ల శుక్లాలు పెరిగితే ఆపరేషన్ చేయాల్సి ఉంటుంది. దీనికితోడు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు యాంటీబయాటిక్స్ ఎక్కువగా వాడటంతోపాటు, షుగర్ వ్యాధిగ్రస్తులకు కంట్లో తెల్లశుక్లాలు పెరుగుతాయి. వీరందరికీ కంటి వైద్యం చేయాల్సి ఉంటుంది. గత ప్రభుత్వం 2023 జనవరి నెల నుంచి జూన్ నెల వరకు కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించింది. కంటి సమస్యలను గుర్తించి తగిన చికిత్స అందించింది. అవసరమైన వారికి కళ్ల జోళ్లు పంపిణీ చేసింది. జిల్లాలో 4,46,675 మందికి కళ్ల స్క్రీనింగ్ చేశారు. 1,31,080 మందికి కళ్లజోళ్లు అందజేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కంటి వెలుగు కార్యక్రమం నిలిపివేసింది. ప్రభుత్వాస్పత్రుల్లో కూడా కంటి వైద్యం అందకపోవడంతో బాధితులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది.

మౌలిక వసతులు కల్పించాలి

గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి శరత్



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన పీఓ రాహుల్, అధికారులు

భద్రాచలంటౌన్: కొండరెడ్ల గిరిజన కుటుంబాలకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని ఐటీడీఏ అధికారులను రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ సెక్రటరీ శరత్ ఆదేశించారు. ఆదివారం హైదరాబాద్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పీవీటీజీ మారుమూల ప్రాంత కొండరెడ్ల గిరిజన కుటుంబాలకు ప్రధాన మంత్రి జన్‌జాతి, ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకాల ద్వారా కల్పించాల్సిన వసతి సౌకర్యాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివాసీ గ్రామాల్లో అందరికీ ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్, ఆయుష్మాన్ భవ కార్డు, పీఎం కిసాన్ క్రెడిట్ కార్డు, ఫారెస్ట్ పోడు భూములకు పట్టాలు అందించే కార్డు, రేషన్ కార్డు, పల్లెల్లో రోడ్డు సౌకర్యాలు ఉన్నాయా? లేవా అనే అంశాలపై సర్వే చేయాలన్నారు. అక్టోబర్ 10వ తేదీవరకు కొండరెడ్ల గ్రామాల్లో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి కార్డులు అందించాలని, విద్యుత్, రోడ్లు, తాగునీటి సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. మల్టీపర్పస్ సెంటర్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలనానరు. ఐటీడీఏ పీఓ బి.రాహుల్ మాట్లాడుతూ జిల్లాలోని 8 పీవీటీజీ గ్రామాలైన రెడ్డిగూడెం, గోగులపూడి, తిరుమల కుంట, శుద్ధగోతుల గూడెం, నడిమిరెడ్డిగూడెం, బండారి గుంపు, గాండ్లగూడెం, పూసుకుంట గ్రామాల్లో దాదాపు 368 కుటుంబాల్లో 1100 మంది కొండరెడ్డి గిరిజనులు నివసిస్తున్నారని పేర్కొన్నారు. వారందరికీ మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండరెడ్ల అధికారి నరేష్, ఈజీఎస్ ఏపీఓ రామచంద్రరావు, ఏపీఎం వెంకట్‌రెడ్డి, పంచాయతీ సెక్రెటరీ సమిత, డీటీ రామకృష్ణ, డాక్టర్ చైతన్య, జ్యోతి, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో నేడు మంత్రి పొంగులేటి పర్యటన



ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10.30 గంటలకు పాల్వంచలో ప్రెస్ క్లబ్ భవనాన్ని ప్రారంభిస్తారు. ఆ తర్వాత కొత్తగూడెంలోని మేదరబస్తీలో కౌన్సిలర్ పూర్ణ కుటుంబాన్ని పరామర్శిస్తారు. మధ్యాహ్నం 2.45 గంటలకు ఖమ్మం నగరంలోని ఆల్లీపురం కొత్తగూడెంలో రామసంగం, సహకారనగర్‌లో కిలారు రామకృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. సాయంత్రం 4 గంటలకు కూసుమంచి క్యాంపు కార్యాలయంలో గీత కార్మికులకు కాటమయ్య రక్ష కిట్లను పంపిణీ చేస్తారు. రాత్రి 8 గంటల వరకు ప్రజలకు, నాయకులకు, అభిమానులకు అందుబాటులో ఉంటారని క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ దయాకర్‌రెడ్డి తెలిపారు.

'ముందస్తు' ఫలితమేది?

- రైళ్లలో బెర్త్ బుక్ చేసుకున్నా దక్కని చోటు
- ముందుగానే ఆక్రమించుకుంటున్న ఇతరులు
- దూరప్రాంత రైళ్లలో నిత్యం ఇదే సమస్య
- టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన కరువు



ఖమ్మం రాపర్తి నగర్: ఖమ్మం మీదుగా విజయవాడ, సికింద్రాబాద్, బల్లార్షా మార్గాల మీదుగా నడిచే రైళ్లలో రిజర్వేషన్ ఉన్నా బెర్త్ దక్కించుకోలేని పరిస్థితి నెలకొంటోంది. రప్తీసాగర్, అహల్యనగర్, సంఘమిత్ర, అండమాన్, కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ప్రయాణానికి నెలల ముందుగా రిజర్వేషన్ చేసుకున్నా వృథాప్రయాసే అవుతోందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఖమ్మం వచ్చేసరికే ఆ బెర్త్‌ల్లో ఇతరులు ఉండడం.. ఫిర్యాదు చేద్దామంటే టీసీలు కానరాకపోవడమే కాక టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసినా పెద్దగా స్పందన ఉండడం లేదని చెబుతున్నారు.

నిత్యం వాగ్వాదాలు..

రైలులో దూరప్రాంతాలకు వెళ్లేవారు ముందస్తుగా రిజర్వేషన్ చేయించుకుంటారు. అయితే, ఖమ్మం లేదా ఇతర ప్రాంతాల్లో సదరు ప్రయాణికులు ఎక్కేసరికి ఆ బెర్త్‌లో జనరల్ టికెట్ కలిగిన వారు కనిపిస్తారు. రప్తీసాగర్, అహల్యనగర్, సంఘమిత్ర, అండమాన్, కోణార్క్ రైళ్లలో ఎక్కువగా బిహార్, మధ్య ప్రదేశ్, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల నుంచి ప్రయాణికులు తమిళనాడు, కోల్‌కతా, కేరళ తదితర రాష్ట్రాల్లో ఉపాధి కోసం వెళ్తుంటారు. అయితే, ఆయా రైళ్లకు ముందు, వెనుక రెండేసి మాత్రమే జనరల్ బోగీలు ఉండడంతో వాటిలో జాగా లేక రిజర్వేషన్ బోగీల్లో కూర్చుంటున్నారు. తీరా రిజర్వేషన్ కలిగిన ప్రయాణికుడు వచ్చినప్పుడు కాస్త సీటు ఇచ్చి సర్దుకోవాలని చెబుతుండడంతో ముందుగా సీట్ బుక్ చేసుకున్నా ఫలితం ఏమిటనే ఆవేదన వ్యక్తమవుతోంది.

సర్దుకుపోండి..

రిజర్వేషన్ సీటు ఖాళీ లేకపోవడంతో ప్రయాణికులు రైల్వే ఎంక్వైరీ నంబర్లకు ఫోన్ చేస్తే రైల్వే పోలీసులు వచ్చి రిజర్వేషన్ లేని వారిని ఇతర బోగీల్లోకి పంపిస్తారు. అయితే, ఎక్కువ సార్లు పోలీసులు కూడా 'సర్దుకుపోండి' అని చెబుతుండడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి ఎదురవుతోందని ప్రయాణికులు అంటున్నారు. రెండు, మూడు నెలల క్రితం రిజర్వేషన్ చేయించుకున్నా తమకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జనరల్ బోగీలు పెంచితేనే..

రాష్ట్రాల నడుమ రాకపోకలు సాగించే రైళ్లలో ఎక్కువగా రిజర్వేషన్ బోగీలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ముందు, వెనుకా ఒకటి, రెండు తప్ప ఎక్కువగా జనరల్ బోగీలు ఉండవు. తద్వారా అందరికీ ఆయా బోగీల్లో చోటు సరిపోక రిజర్వేషన్ బోగీల్లోకి ఎక్కుతున్నారు. ఫలితంగా రిజర్వేషన్ కలిగిన ప్రయాణికులకు ఇక్కట్లు ఎదురవుతున్నాయని తెలుస్తోంది. ఇకనైనా జనరల్ బోగీల సంఖ్య పెంచడంతో పాటు రిజర్వేషన్ కలిగిన వారు మాత్రమే నిర్దేశిత బోగీల్లో ఉండేలా పర్యవేక్షించాలనే వినతులు వెల్లువెత్తుతున్నాయి.

పట్టించుకోని టీసీలు

రిజర్వేషన్ బెర్త్‌ల విషయమై టీసీలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. రైలు బయలుదేరినప్పుడే ఏ బోగీ, ఏ బెర్త్‌లో ప్రయాణికులు ఎక్కడ ఎక్కుతారో జాబితా ఆధారంగా టీసీలకు తెలిసిపోతుంది. దీంతో రిజర్వేషన్ లేని ప్రయాణికులు సంప్రదిస్తే ఫలానా బెర్త్‌లో ఖమ్మంలో ప్రయాణికులు ఎక్కుతారని.. అప్పటివరకు తీసుకోవచ్చని చెబుతున్నట్లు సమాచారం. ఈక్రమంలో జరిమానా తీసుకుని రశీదు ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా ఖమ్మం లేదా ఇతర ప్రాంతాల్లో బెర్త్ కలిగిన వారు ఎక్కినప్పుడు ముందుగానే టీసీని సంప్రదించి బెర్త్ తీసుకున్న వారు తాము డబ్బు చెల్లించామని వాగ్వాదాలకు దిగడం పరిపాటిగా మారుతోంది.

కేటీపీఎస్‌లో పలువురికి పదోన్నతులు

పాల్వంచ: కేటీపీఎస్ కాంప్లెక్స్‌లో పలువురు ఉద్యోగులకు పదోన్నతులు, బదిలీలు జరిగాయి. ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. వైటీపీఎస్ కర్మాగారం సివిల్ విభాగంలో పనిచేస్తున్న రాఘవేంద్ర ఏఈఈ నుంచి ఈఈగా పదోన్నతిపై కేటీపీఎస్ 5,6 దశలకు బదిలీపై రానున్నారు. కేటీపీఎస్ 5వ దశలో పనిచేస్తున్న చీఫ్ కెమిస్ట్ ప్రమీలను సీనియర్ కెమిస్ట్‌గా పదోన్నతిపై వైటీపీఎస్‌కు బదిలీ చేశారు. 7వ దశకు చెందిన సీనియర్ కెమిస్ట్ గిరిధర్ చీఫ్ కెమిస్ట్‌గా పదోన్నతి లభించింది. కేటీపీపీకి చెందిన సరళదేవి సీనియర్ కెమిస్ట్ నుంచి చీఫ్ కెమిస్ట్‌గా కేటీపీఎస్ 7వ దశకు బదిలీ అయ్యారు. 7వ దశలో కెమిస్ట్ నుంచి సీనియర్ కెమిస్ట్‌గా ఆరుగురిగా, 5,6 దశల్లో మరో ముగ్గురికి పదోన్నతి లభించింది. ఏఓ నుంచి ఎస్‌ఏఓగా సతీష్, మధుసూదన్ రెడ్డికి పదోన్నతి వచ్చింది. కేటీపీఎస్ 7వ దశలో జేఏఓ నుంచి ఏఏవోలుగా ముగ్గురు, 6వ దశలో మరో ముగ్గురికి పదోన్నతి లభించింది. 7వ దశలో పర్సనల్ ఆఫీసర్‌గా ఉన్న వసంతి కుమారిని అసిస్టెంట్ సెక్రటరీగా 7వ దశకు పదోన్నతిపై బదిలీ చేశారు. 5,6 దశల్లో సివిల్ సర్జన్ శ్రీనివాసరావుకు డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పదోన్నతిపై నాగర్జునసాగర్‌కు వెళ్లనున్నారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి



కిన్నెరసాని జలాశయంలో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. డ్యామ్ సమీపం నుంచి జలాశయాన్ని, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదాగా గడిపారు. 558 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా, వైల్డ్‌లైఫ్ శాఖ రూ.20,175 ఆదాయం, 250 మంది బోటు షికారు చేయగా, టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.14,340 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

అశాస్త్రీయ భావాలు తొలగించాలి

జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

ఖమ్మం సహకారనగర్ : సమాజంలో పేరుకుపోయిన అశాస్త్రీయ భావనలను తొలగించేందుకు, శాస్త్రీయ దృక్పథం పెంచేందుకు జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) కృషి చేస్తోందని సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కోయ వెంకటేశ్వరరావు, కోశాధికారి ఆర్.వరప్రసాద్ అన్నారు. నగరంలోని కవితా మెమోరియల్ డిగ్రీ కాలేజీలో ఆదివారం ఖమ్మం జిల్లా మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శాస్త్రీయ దృక్పథాన్ని ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలన్నారు. చెకుముఖి టాలెంట్ టెస్ట్ ద్వారా ప్రతి ఏటా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో మూఢ నమ్మకాలు పెట్రేగిన సమయంలో వాటి నిర్మూలనకు జేవీవీ కార్యకర్తలు కృషి చేస్తున్నారని చెప్పారు. సంఘం రాష్ట్ర నాయకులు అలవాల నాగేశ్వరరావు, మల్లెంపాటి వీరభద్రరావు తదితరులు మాట్లాడారు.

ఖమ్మం జిల్లా కమిటీ ఎన్నిక..

మహాసభలో జేవీవీ ఖమ్మం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వి.మోహన్, ప్రధాన కార్యదర్శిగా కె.రామారావు, కోశాధికారి గా టి.శివన్నారాయణ ఎన్నికయ్యారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా మల్లెంపాటి వీరభద్రరావు, వంజాకుల లక్ష్మీనారాయణ, ఎం.సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా తాతా రాఘవయ్య ఎన్నికయ్యారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహించొద్దు



పాత సూరారంలో డ్రెయినేజీ కాలువను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ భాస్కర్‌నాయక్ తదితరులు

డీఎంహెచ్ఓ భాస్కర్‌నాయక్

పాల్వంచరూరల్: వైద్యసేవలు అందించడంలో సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండొద్దని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎల్.భాస్కర్‌నాయక్ ఆదేశించారు. మండల పరిధిలోని పాతసూరారంలో రెండు రోజుల క్రితం వాంతులు, విరేచనాలతో 16 మంది అస్వస్థతకు గురైన విషయం విదితమే. వారిలో కారం ఆదయ్య ఆదివారం మృతిచెందడంతో డీఎంహెచ్ఓ గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోని పలు నివాసాలకు వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వీధిలో సరఫరా జరిగే తాగునీటి పైపులైన్‌ను పరిశీలించారు. కలుషిత ఆహారం కారణంగా వాంతులు, విరేచనాల సమస్య వచ్చి ఉంటుందని డీఎంహెచ్ఓ అనుమానం వ్యక్తంచేశారు. అనంతరం వైద్యసిబ్బందితో మాట్లాడారు. ఇంటింటికీ తిరిగి వైద్యసేవలు అందించాలని, పరిస్థితిని బట్టి గ్రామంలో ఆరోగ్య శిబిరం కొనసాగించాలని ఆదేశించారు. ఆరోగ్యం విషయంలో ఎలాంటి అనుమానాలు గమనించిన 108 ద్వారా జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి పంపించి మెరుగైన వైద్యం అందించాలని చెప్పారు. దోమల నివారణ కోసం నివాసాల్లో లార్వా లేకుండా చూడాలన్నారు. డీఎంహెచ్ఓ వెంట జగన్నాథపురం పీహెచ్‌సీ డాక్టర్ రాజు, హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

క్రీడా సామగ్రి సరఫరాకు టెండర్లు

భద్రాచలంటౌన్: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని క్రీడా పాఠశాలలకు అవసరమైన క్రీడా సామగ్రి సరఫరా చేసేందుకు ఆసక్తి ఉన్న వారి నుంచి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. పాన్ కార్డ్, టిన్ కార్డ్ నంబర్లు, బ్యాంక్ ఖాతా కలిగిన తెలంగాణలోని అన్ని జిల్లాల వారు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఐటీడీఏ కార్యాలయంలో ఈనెల 26 నుంచి 31వ తేదీ వరకు రూ.2వేల డీడీ చెల్లించి టెండర్ షెడ్యూల్ తీసుకోవాలని, ఆపై రూ.లక్ష డీడీ జత చేసి సమర్పించాలని సూచించారు. ఈనెల 31న సాయంత్రం టెండర్లు పరిశీలించనుండగా, టెండర్‌దారులు శాంపిళ్లతో హాజరు కావాలని పీఓ తెలిపారు.

తాలిపేరుకు తగ్గిన వరద

చర్ల: తాలిపేరు మధ్య తరహా ప్రాజెక్టుకు వరద ఉధృతి తగ్గుతోంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్‌లో శనివారం కురిసిన భారీ వర్షానికి ప్రాజెక్టులోకి వరద చేరవడంతో 25 గేట్లను ఎత్తి 63,889 క్యూసెక్కుల చొప్పున నీటిని గోదావరిలోకి విడుదల చేశారు. ఎగువన వర్షాలు తగ్గుముఖం పట్టడంతో గేట్లను ఒక్కొక్కటిగా దించారు. ప్రస్తుతం 12 గేట్లను రెండు అడుగుల మేర ఎత్తి 15,141 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి వరద తగ్గడంతో గేట్లను దించుతున్నామని ప్రాజెక్టు డీఈ తిరుపతి చెప్పారు.

బ్రీత్ ఎనలైజర్ ఫలితాల్లో తేడా


మాట్లాడుతున్న అప్పారావు

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీ అధికారులు వినియోగిస్తున్న బ్రీత్ ఎనలైజర్ మిషన్లలో సాంకేతిక లోపాలు ఉన్నాయని, వాటి ద్వారా డ్రైవర్ల బ్రీత్‌ను పరీక్షించడం ద్వారా తప్పుడు ఫలితాలు వస్తున్నాయని టీజీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు అన్నారు. ఆదివారం ఖమ్మంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో జరిగిన యూనియన్ ఖమ్మం రీజియన్ కార్యవర్గ సమావేశం ఖమ్మం డిపో కోశాధికారి దామాల లాజర్ అధ్యక్షతన నిర్వహించారు. అప్పారావు మాట్లాడుతూ.. బ్రీత్ ఎనలైజర్‌ను సరైన పద్ధతిలో వాడటం లేదని తెలిపారు. ఆ ఫలితాలతో సిబ్బందిని విధుల నుంచి తప్పించడం అన్యాయమని, పోలీస్ స్టేషన్లలో ఉండే బ్రీత్ ఎనలైజర్‌లను వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో తిమ్మినేని రామారావు, కందుల భాస్కరరావు, అరుణకుమారి, జి.రమేశ్‌బాబు, నజీర్, కేవీ భద్రం, డి.శ్రీనివాసరావు, ఆర్‌ఎస్ సింగ్, షేక్ నాగుల్‌మీరా, బుర్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

సస్పెండైన పీఏసీఎస్ సీఈఓ అరెస్ట్

ఇల్లెందురూరల్: యూరియా విక్రయాల్లో అక్రమాలకు పాల్పడినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటూ సస్పెన్షన్‌కు గురైన పీఏసీఎస్ సీఈఓ హరిప్రసాద్‌ను అరెస్టు చేసినట్లుగా కొమరారం ఎస్‌ఐ సోమేశ్వర్ ఆదివారం తెలిపారు. వ్యవసాయ, సహకార శాఖల అధికారుల ఫిర్యాదు మేరకు రెండు రోజుల కిందట కేసు నమోదు చేశామని, ఉన్నతాధికారుల ఆదేశం మేరకు అరెస్టు చేశామని ఎస్‌ఐ వివరించారు.

మహిళపై దాడి

మణుగూరుటౌన్: మున్సిపాలిటీలోని చాపల మార్కెట్‌లో నివసించే మహిళపై కొందరు మహిళలు రాత్రివేళ అకస్మాత్తుగా దాడి చేసి గాయపర్చారు. బాధితురాలు ఆదివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మున్సిపాలిటీకి చెందిన ఓ ప్రముఖ వైద్యుడికి రెండో భార్యగా ఉన్నానని, 2015లో తమకు వివాహం జరిగినా ఆ విషయం ఎవరికీ చెప్పలేదని వాపోయింది. వైద్యుడి మొదటి భార్య అయిన వైద్యురాలికి కూడా ఈ విషయం తెలుసని, ఉన్నట్టుండి ఆదివారం ఆ వైద్యురాలు బూర్కాలో వచ్చి ఆమెతో మరో 20 మంది మహిళలు వచ్చి కారం చల్లి, కర్రలతో నాతో పాటు తల్లిదండ్రులపై దాడి చేసి గాయపర్చారని కన్నీరుమున్నీరైంది. బూర్కాలో వచ్చిన వైద్యురాలిపై చర్యలు తీసుకుని తనపై దాడి చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. వైద్యుడిని తన భర్తగా అందరి ముందు అంగీకరించాలని కోరింది.

మనస్తాపంతో డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య

ఖమ్మంక్రైం: డిగ్రీ ఫెయిలయ్యాననే మనస్తాపంతో ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఖమ్మంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ సీఐ ఉదయ్‌కుమార్ కథనం ప్రకారం.. నగరంలోని పెంటగడ్డ బజార్‌కు చెందిన గబ్బుల వీర వెంకట సత్యనారాయణ కూతురు మౌనికశ్రీ (20) డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతోంది. ఇటీవల ప్రకటించిన సెమిస్టర్ ఫలితాల్లో రెండు సబ్జెక్ట్‌ల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురైన మౌనిక ఇంట్లో ఈనెల 16న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగింది. అపస్మారక స్థితిలో ఉండడాన్ని గమనించిన కుటుంబసభ్యులు ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలిచంగా ఆదివారం మృతిచెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీకృష్ణాష్టమిని అంతటా సోమవారం జరుపుకోనున్నారు. ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆలయాలు ముస్తాబయ్యాయి. జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం, సూపర్‌బజార్, పెద్దబజార్, చిన్నబజార్, రైటర్‌బస్తీ, కూలీలైన్, పాత కొత్తగూడెం, విద్యానగర్‌కాలనీ, పాలకేంద్రం, రైటర్‌బస్తీ, హనుమాన్‌బస్తీ, బూడిదగడ్డబస్తీ, రామవరం, రుద్రంపూర్, గౌతంపూర్‌తో పాటు పలు ప్రాంతాల్లోని ఆలయాల్లో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. – కొత్తగూడెంటౌన్

నేడు కృష్ణాష్టమి..

- రెండు రోజుల పాటు పండుగ అంటూ ప్రచారం
- వేడుకలకు ఆలయాలు ముస్తాబు
- ఉట్లు కొట్టే సంబరాలకు భక్తులు సిద్ధం



ప్రత్యేకంగా ఏర్పాట్లు

కొత్తగూడెం పెద్దబజార్, చిన్నబజార్, పాత కొత్తగూడెంలలోని మార్వాడీ క్యాంప్‌లో పండుగకు అందరూ కలిసి కోలాటాలు ఆడుతూ, భక్తి గీతాలకు అనుగుణంగా నృత్యాలు చేస్తారు. చిన్నారులను శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేశధారణలతో అందంగా ముస్తాబు చేస్తారు. అంతేకాకుండా కృష్ణుడి ప్రతిమను ఊయ్యాలలో ఉంచి, పాలు, పెరుగు, వెన్నతో పాటు రకరకాల పండ్లను నైవేద్యంగా సమర్పిస్తారు.

ఉట్టి కొట్టి..

శ్రీకృష్ణాష్టమి పండుగ సందర్భంగా పలుచోట్ల ఉట్టికొట్టే వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. యువకులు, యువతులు, చిన్నారులు, పెద్దలు అందరూ కలిసి ఉట్టిని కొట్టేందుకు పోటీ పడతారు. ఆలయాల్లోనూ ప్రత్యేక పూజల అనంతరం కమిటీల ఆధ్వర్యంలో ఉట్టి కొట్టే పోటీలు నిర్వహిస్తారు. ఉట్టిని కొట్టిన వారికి బహుమతులు అందించనున్నారు.

పలు సందేహాలు..

ఈ సారి వేడుకలను రెండు రోజుల పాటు జరుపుకుంటారని సోమవారం తెల్లవారుజామున 3.39 గంటలకు శ్రావణమాసం కృష్ణ పక్షం అష్టమి తిథి ప్రారంభమై 27వ తేదీ మంగళవారం తెల్లవారుజాముతో ముగుస్తోంది. అయితే పండుగను 26న, లేక 27వ తేదీన జరుపుకోవాలా? అని భక్తులకు పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి సమాధానంగా స్మార్త కృష్ణాష్టమి, వైష్ణాష్టమిగా రెండు రోజుల పాటు జరుపుకోవాలని సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగుతోంది. అయితే దీనిపై వేద పండితులు, అర్చకులు మాత్రం పండుగను సోమవారం నాడే జరుపుకోవాలని స్పష్టం చేస్తున్నారు.


వేడుకలకు సిద్ధమైన రామవరంలోని వేణుగోపాలస్వామి ఆలయం

పండుగ రోజే..



అతివలకు అత్యంత ఇష్టమైన గోపాలుడు.. కోరిన కోరికలను తీర్చే వాడు శ్రీకృష్ణుడు. కాబట్టి ఆ దేవుడు అష్టమి రోజున పుట్టడంతో పండగను ఘనంగా జరుపుకుంటాం. సోమవారం అష్టమి కావడంతో పండుగను అదే రోజు జరుపుకోవాలి. ఉట్టి కొట్టే వేడుకలు సైతం నిర్వహిస్తున్నారు. భక్తి శ్రద్ధలతో శ్రీకృష్ణుడిని వేడుకుంటే మంచి ఫలితం ఉంటుంది.
– కొండవేటి దత్తాత్రేయశర్మ, అర్చకులు

అధికంగా సభ్యత్వ నమోదు చేయాలి

బీజేపీ నేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి


మాట్లాడుతున్న సుధాకర్ రెడ్డి

చుంచుపల్లి: జిల్లాలో అధికంగా పార్టీ సభ్యత్వ నమోదు చేయాలని బీజేపీ తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు జిల్లా అధ్యక్షుడు కేవీ రంగా కిరణ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ అధికారం చేపట్టిన నాటి నుంచి దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని అన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం పదేళ్ల కాలంలో రైతులకు, పేద మధ్యతరగతి వర్గాల వారికి పలు రకాల సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. సింగరేణిలో జరుగుతున్న అవినీతిపై కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, సెంట్రల్ విజిలెన్స్ దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సభ్యత్వం నమోదు చేయాలన్నారు. దళిత మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొప్పు భాష మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 4న, మండల కేంద్రాల్లో సెప్టెంబర్ 5న సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. సమావేశంలో నాయకులు తాటిపాముల ఐలయ్య, పోనిశెట్టి వెంకటేశ్వర్లు, కుంజా ధర్మా, పైడిపాటి రవీందర్, కొలిక పోగు మునలయ్య, ముస్కు శ్రీనివాసరెడ్డి, బానోతు విజయలక్ష్మి, పోడియం బాలరాజు, గొడుగు శ్రీధర్, బలగాని గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు కేసులపై న్యాయపోరాటం చేస్తా

- అది రైతులు కొనుగోలు చేసిన యూరియా
- డీసీసీబీ డైరెక్టర్ జనగం కోటేశ్వరరావు


మాట్లాడుతున్న కోటేశ్వరరావు

ఇల్లెందురూరల్: ప్రాథమిక సహకార సంఘం నుంచి స్థానిక రైతులే యూరియా కొనుగోలు చేశారని, అందులో తాను అక్రమాలకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని డీసీసీబీ డైరెక్టర్ జనగం కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని మాణిక్యారంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 22న పీఏసీఎస్ ద్వారా యూరియా కొనుగోలు చేసిన 14 మంది రైతులు బొలేరో వాహనంలో బస్తాలను మాణిక్యారం గ్రామానికి చేర్చారని, చీకటి పడటం, కొంత మంది రైతులు ముందే ఇంటికి చేరుకోవడంతో తన గోదాములో డంప్ చేశారని చెప్పారు. ఈ క్రమంలో యూరియా అక్రమంగా నిల్వ చేస్తున్నారని కొంత మంది ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు యూరియాను స్వాధీనం చేసుకున్నారని, ఆ తర్వాత వ్యవసాయ, సహకార శాఖలు వేగవంతంగా విచారణ పూర్తి చేసి కేసులు నమోదు చేశాయని ఆరోపించారు. యూరియా బస్తాలు పోలీసు శాఖ నుంచి వ్యవసాయ శాఖ పరిధిలోకి వచ్చిన తరువాత 14 మంది రైతులు అవి తమవని పేర్కొంటూ ఏవో సతీష్‌కు వినతిపత్రం ఇచ్చారని చెప్పారు. కానీ అప్పటికే కేసు నమోదైనందున తమ నిజాయితీని నిరూపించుకునేందుకు న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో పలు పార్టీల నాయకులు, రైతులు పోషం వెంకటేశ్వర్లు, బానోత్ రమేష్, పోతుగంటి రాము, బండారు సత్యం, రామటెంకి సత్యం, కొండ మల్లేష్, కోడి కృష్ణ, రాజు, ఉపేందర్, సారయ్య, భార్గవ్, శ్రీకాంత్, మురళి, శివ తదితరులు పాల్గొన్నారు.

కత్తితో గొంతు కోసుకున్న యువకుడు

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి




రామకృష్ణకు చికిత్స చేస్తున్న వైద్యులు

పాల్వంచ: ఆర్థిక ఇబ్బందులతో పాటు మతి స్థిమితం సరిగా లేక పోవడంతో యువకుడు కూరగాయలు తరిగే కత్తితో గొంతు కోసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని వెంగళరావుకాలనీకి చెందిన లంజపల్లి రామకృష్ణ (36) చెప్పులు కుట్టుకుంటూ జీవిస్తున్నాడు. ఆర్థిక పరిస్థితి బాగోలేక ఇబ్బందులు పడుతుండటంతో పాటు మద్యానికి బానిస అయ్యాడు. కొంతకాలంగా మానసిక స్థితి సరిగా లేదు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇంట్లోకి వెళ్లి కూరగాయలు తరిగే కత్తితో గొంతు కోసుకున్నాడు. గుర్తించిన అతని భార్య సంధ్య, కొడుకులు ప్రభాకర్, వసంతరావు అంబులెన్స్‌లో పాల్వంచ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతుని తండ్రి కేటీపీఎస్ రిటైర్డ్ ఉద్యోగి నాగభూషణం ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేపల వేటకు వెళ్లి మృత్యు ఒడిలోకి

సీతారామ కెనాల్‌లో పడి ఇద్దరు మృతి




జమీరుద్దీన్, రియాజ్ మృతదేహాలు




కుటుంబసభ్యులతో జమీరుద్దీన్, రియాజ్ (ఫైల్)

బూర్గంపాడు: సరదాగా చేపలు పట్టేందుకు వెళ్లిన ఇద్దరు యువకులు మృత్యుఒడికి చేరారు. ఆదివారం ఆటవిడుపుగా ఉంటుందని సరదాగా చేపలు పడదామని వెళ్లిన వారిని సీతారామ కెనాల్ పొట్టన పెట్టుకుంది. ఈ ఘటన మండలంలోని జింకలగూడెం గ్రామం వద్ద ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కొత్తగూడెం పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన షేక్ జమీరుద్దీన్ (37), అతని తోడల్లుడి కొడుకు షేక్ రియాజ్ (17)లు ఆదివారం వేకువజామున సరదాగా చేపలు పడతామని జింకలగూడెం సమీపంలోని సీతారామ కాలువ వద్దకు మోటార్ సైకిల్‌పై వచ్చారు. చేపలు పట్టేందుకు కాలువలోకి దిగిన వారు లోతు ఎక్కువగా ఉండటంతో మునిగి గల్లంతయ్యారు. స్థానికులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్‌ఐ రాజేశ్ ఘటనాప్రాంతానికి చేరుకుని, భద్రాచలం నుంచి గజ ఈతగాళ్లను, ఫైర్ సిబ్బందిని పిలిపించి గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం జమీరుద్దీన్, రియాజ్‌ల మృతదేహాలను గత ఈతగాళ్లు వెలికితీశారు. అయితే మృతులను గుర్తించేందుకు కొంత సమయం పట్టింది. ఇంతలో కాలువ గట్టుపై పెట్టిన రియాజ్ ఫోన్‌కు కాల్ రావడంతో ఎస్‌ఐ రాజేశ్ మాట్లాడగా.. తెనాలి నుంచి రియాజ్ కుటుంబ సభ్యులు మాట్లాడారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. జమీరుద్దీన్ కుటుంబసభ్యులు భద్రాచలం ఆస్పత్రికి చేరుకుని, గుండెలావిసేలా రోదించారు. కాగా, జమీరుద్దీన్ కొత్తగూడెంలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. అతనికి భార్య షాహీనా, ముగ్గురు పిల్లలున్నారు. షాహీనా అక్క పర్వీన్, బావ కరీముల్లా తెనాలిలో ఉంటారు. వారి కుమారుడు రియాజ్ కొత్తగూడెంలోని పిన్ని వద్ద ఉంటూ ఐటీఐ చదువుతున్నాడు. ఆదివారం బాబాయి, అబ్బాయి సరదాగా చేపల వేటకు వెళ్లి మరణించారు. ఘటనా స్థలాన్ని పాల్వంచ సీఐ వినయ్‌కుమార్ పరిశీలించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సోదరుడే కన్నేసి.. కాటికి పంపాడు

బీజాపూర్ జిల్లా పామేడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన


ఉంగి మృతదేహం

చర్ల: వరుసకు సోదరుడయ్యే ఓ వ్యక్తి.. యువతిపై కన్నేశాడు. అయితే ఆ యువతికి మరో వ్యక్తితో నిశ్చితార్థం జరగడంతో తనకు కాకుండా పోతోందన్న కసితో కత్తితో పొడిచి కాటికి పంపిన ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో ఆదివారం చోటుచేసుకుంది. పామేడు పోలీస్ స్టేషన్ పరిధిలోని యాంపురం గ్రామానికి చెందిన మడకం ఉంగి, బీజాపూర్‌కు చెందిన మడకం పర్జావల్ వరుసకు అన్నా చెల్లెల్లు. అయితే పర్జావల్ ఉంగిపై కన్నేసి కొంతకాలంగా తప్పుడు ఆలోచనలు చేస్తున్నాడు. ఈ క్రమంలో ఉంగికి ఇటీవల వేరే యువకుడితో నిశ్చితార్థం జరుగగా, వారి ఆచార సంప్రదాయాల ప్రకారం వివాహానికి ముందు కొన్ని రోజులు వరుడి ఇంట్లో ఉండాలి. దీంతో అలా వెళ్లి తిరిగి యాంపురం గ్రామానికి వచ్చింది. ఈ క్రమంలో పర్జాలాల్ ఆదివారం ఆ గ్రామానికి చేరుకుని ఉంగిపై కత్తితో విచక్షణారహితంగా పొడవడంతో అమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా పామేడు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఐదు నిమిషాల్లో ఇంటికి చేరాల్సి ఉండగా..

- రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి
- పెదనాన్నను పరామర్శించి వస్తూ అనంతలోకాలకు..


శివయ్య (ఫైల్)

కల్లూరు: తన పెదనాన్నను ఆస్పత్రిలో పరామర్శించి వస్తూ.. మరో ఐదు నిమిషాల్లో ఇల్లు చేరుతాడనుకున్న సమయంలో ఓ యువకుడిని రోడ్డు ప్రమాదం కబలించింది. కల్లూరులో టీజీఎస్‌రోడ్ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి.. కల్లూరు గోపాలకుంటకు చెందిన గోకరి వీరయ్య, నారాయణమ్మ దంపతుల కుమారుడు శివయ్య (23) శనివారం రాత్రి ఖమ్మంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో తన పెదనాన్న వెంకన్న చికిత్స పొందుతుండగా పరామర్శించి ఆదివారం తెల్లవారుజామున ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. కల్లూరు చేరుకుని, మరికొన్ని నిమిషాల్లో ఇంటికి వెళ్లేబోయే శివయ్యను సత్తుపల్లి వైపు నుంచి ఖమ్మం వైపు కొబ్బరిబొండాల లోడుతో వెళ్తున్న బొలేరో వాహనం అతివేగంగా వస్తూ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుబల్లి తరలించారు. బొలేరో వాహనం డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఎస్‌కే షాకీర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ డ్రైవర్‌పై కేసు నమోదు

పాల్వంచ: రోడ్డుపై సడన్ బ్రేక్ వేసి లారీని ఆపడంతో వెనుక వస్తున్న కారు ఢీకొని.. అందులో ప్రయాణిస్తున్న కానిస్టేబుల్‌కు గాయాలైన ఘటనలో లారీ డ్రైవర్‌పై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కలెక్టరేట్ ఎదుట శనివారం లారీని వెనుక నుంచి కారు ఢీ కొట్టడంతో ముందు బాగం నుజ్జునుజ్జు కాగా.. కారు నడుపుతున్న కానిస్టేబుల్ నాగ రమణా రెడ్డికి తీవ్రగాయాలైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రమణారెడ్డి తండ్రి శీలం వెంకటేశ్వర్ రెడ్డి ఫిర్యాదుతో కేరళ రాష్ట్రంలోని ఎర్నాకులంకు చెందిన లారీ డ్రైవర్ రామన్ సుధపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

కేసు నమోదు

పాల్వంచరూరల్: ఒకరిపై దాడికి పాల్పడిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని సంగం గ్రామంలో ఆదివారం వనదేవతల కార్యక్రమాన్ని నిర్వహించగా అక్కడ ఏర్పాటు చేసిన లైటింగ్ సిస్టం వద్ద ఉన్న దనుగూరి వెంకన్నకు, అదే గ్రామానికి చెందిన బి.చరణ్‌తేజ్‌కు గొడవ జరిగింది. చరణ్‌తేజ్ తనపై దాడి చేశాడని వెంకన్న ఫిర్యాదు చేయగా ఆదివారం కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నేలకొండపల్లి: మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. పగిడిపత్తి వీరబాబు (45) ఆదివారం బైక్‌పై వస్తుండగా మండలంలోని చెరువు మాధారంలో ఆటోఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన వీరబాబును ఖమ్మం తరలించారు.


రెండు బైక్‌లు ఢీ..

పెనుబల్లి: ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరు గాయపడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సూరయ్యబంజర్ తండాకు చెందిన మూడు నాగేశ్వరరావు వీఎం బంజర్‌కు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. కల్లూరు మండలంలోని లింగాలకు చెందిన కత్తి ఉపేందర్ రాజుగూడెం వైపు వెళ్తున్నాడు. ఇద్దరి ద్విచక్రవాహనాలు వీఎం బంజర్ శివారులో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఇద్దరూ గాయపడగా వారిని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మహిళ ఆత్మహత్య

బూర్గంపాడు: భర్త అనారోగ్యంతో మృతి చెందటంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ మహిళ పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం.. లక్ష్మీపురం గ్రామానికి చెందిన మేడగం మల్లీశ్వరి భర్త రెండేళ్ల కిందట అనారోగ్యంతో మృతిచెందాడు. అప్పటి నుంచి ఆమె మోరంపల్లిబంజరలోని పుట్టింట్లో ఉంటోంది. ఆమెకు ఇద్దరు కుమార్తెలుండగా పెద్దకుమార్తెకు వివాహం చేశారు. చిన్నకుమార్తె హైదరాబాద్‌లో చదువుకుంటోంది. భర్త మరణంతో తీవ్ర మనస్తాపంతో ఉన్న ఆమె శనివారం ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమార్తె పవిత్ర ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో క్రీడాకారుడు మృతి


సురేందర్ (ఫైల్)

అశ్వాపురం: మండలంలోని ఆనందాపురం గ్రామంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ క్రీడాకారుడు మృతి చెందాడు. చింతిర్యాల గ్రామ పంచాయతీలోని కట్టంవారి గూడెం గ్రామానికి చెందిన వాలీబాల్, కబడ్డీ క్రీడాకారుడు కుర్సం సురేందర్ (22), వంశీ బైక్‌పై ఆనందాపురం నుంచి సీతారాంపురం వస్తున్నారు. ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టారు. తీవ్రంగా గాయపడిన సురేందర్, వంశీని 108లో మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా సురేందర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ తిరుపతిరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి...

పాల్వంచరూరల్: చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని పాతసూరారం గ్రామంలోని వీరస్వామి ఇంటికి బూర్గంపాడు మండలం పినపాక పట్టీనగర్ గ్రామానికి చెందిన కారం ఆదెయ్య (50) చుట్టపు చూపుగా రెండు రోజుల కిందట వచ్చాడు. వాంతులు, విరేచనాలకు తోడు ఫిట్స్ రావడంతో శనివారం కొత్తగూడెంలోని ఏరియాఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

కామేపల్లి: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. సింగరేణి మండలం చిన్నమడెంపల్లి గ్రామానికి చెందిన లకావత్ రాములు ద్విచక్రవాహనంపై మర్రిగూడెం నుంచి తాళ్లగూడెం వైపు వెళ్తుండగా పెద్దమ్మతల్లి దేవాలయం సమీపంలో కామేపల్లి నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న కారు ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. రాములుకు తీవ్ర గాయాలు కాగా 108 ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పేద విద్యార్థులకు సాయం అందించేందుకు కృషి


ప్రతిజ్ఞ చేస్తున్న వాసవీక్లబ్ ప్రతినిధులు

నేలకొండపల్లి: వాసవీక్లబ్ ద్వారా పేద విద్యార్థులకు రూ.5 వేల చొప్పున దాదాపు రూ.కోటి వరకు అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఇరుకుల్ల రామకృష్ణ వెల్లడించారు. మండల కేంద్రంలోని వాసవీభవన్‌లో ఆదివారం ఉమ్మడి కేబినెట్ మీటింగ్ నిర్వహించగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న రెండు వేల క్లబ్‌ల ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రతీ క్లబ్ నుంచి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు అందిస్తున్నామన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇప్పటిదాకా రూ.25 లక్షల విలువైన సేవా కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. సమావేశంలో గవర్నర్ గుమ్మడవెల్లి శ్రీనివాస్, గంగిశెట్టి గంగాధర, జగదీశ్‌కుమార్, చిదిరాల లింగయ్య, కడవెండి శ్రీనివాస్, రేగూరి హనుమంతరావు, శివకుమార్, దోసపాటి వెంకటేశ్వరరావు, దారా నర్సింహారావు, రేగూరి వాసవి, దోసపాటి చంద్రశేఖర్, గెల్లా కృష్ణారావు, కొత్తా కరుణ, కొత్తా వెంకటేశ్వరరావు, కొత్తా రమేశ్, కొత్తా రాణి, దోసపాటి నాగేశ్వరరావు, దోసపాటి అచ్యుతరామయ్య తదితరులు పాల్గొన్నారు.

నాగులవంచలో దొంగల సంచారం?

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామంలో శనివారం అర్ధరాత్రి పలు వీధుల్లో దొంగలు సంచరించి ఇళ్ల తాళాలు పగులగొట్టినట్లు స్థానికులు తెలిపారు. ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో ఉన్న అంబటి లచ్చయ్య ఇంటి ఆవరణలో ఉన్న గడ్డపారను తీసుకుని పక్క వీధిలో ఉన్న బైరు నర్సింహా ఇంటి తాళాన్ని పగులగొట్టారు. ఆ సమయంలో నర్సింహ కుటుంబ సభ్యులు ఎవరూ ఇంట్లో లేరు. అలికిడి కావటంతో గడ్డపారను అక్కడే వదిలేసి ఇంటి వెనక్కి వెళ్లి సిగరెట్లు తాగిన ఆనవాళ్లు ఉన్నాయని తెలిపారు. అలాగే ప్రధాన రహదారిలో ఉన్న వెల్డింగ్ షాపు, బీసీ కాలనీలో కూడా ఓ ఇంటి తాళం పగులగొట్టినట్లు బాధితులు వాపోయారు. రెండు రోజులుగా గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి సమయాల్లో తిరుగుతున్నారని స్థానికులు తెలిపారు. దీనికి సంబంధించి ఆస్తినష్టం జరిగినట్లు పోలీసులకు ఎలాంటి సమాచారం అందనప్పటికీ పోలీసులు ఆయా ఇళ్లను ఆదివారం పరిశీలించారు. రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ ఏర్పాటు చేయటంతో పాటు నిఘా పెంచుతామని ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

50 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కారేపల్లి : అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఖమ్మం టాస్క్‌ఫోర్స్, కారేపల్లి పోలీసులు ఆదివారం రాత్రి దాడి చేసి పట్టుకున్నారు. మండల పరిధిలోని చెన్నంగులగండ గ్రామంలో ఓ ఇంట్లో ఇల్లెందు పట్టణానికి చెందిన బియ్యం వ్యాపారులు సుమారు 50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచారని సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి ఆ ఇంటిని సైతం సీజ్ చేశారు.